
సాక్షి
వికారాబాద్
బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



సప్త వాహనాలపై శ్రీవారి దర్శనం

పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్‌లోని పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. దేవేరుల సమేత మలయప్ప స్వామి సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం చిన్న శేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, సర్వభూపాల వాహనం, కల్ప వృక్ష వాహనం, చంద్రప్రభ వాహనంపై ఊరేగారు. అర్చకులు శ్రీవారి మూలవిరాట్టుకు అభిషేకం, ముత్యాల పందిరి, తిరుమంజనం తదితర పూజలు జరిపించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున ఇక్కడి ఆలయంలో రథసప్తమి వేడుకలను వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే ఆలయానికి చేరుకొని పూజల్లో పాల్గొన్నారు. - కొడంగల్


హనుమంత వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు


గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు

న్యూస్‌రీల్

భూ ప్రకంపనాలపై భయాందోళన వద్దు


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కొడంగల్ రూరల్: భూ ప్రకంపనాలపై ఎలాంటి ఆందోళనకు గురికారాదని జియాలజిస్టు, ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ డి.శ్రీధర్, టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ జి.సురేష్, రీసెర్చ్ పర్సన్ డాక్టర్ నరేష్, ఏడీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని టేకుల్‌కోడ్ గ్రామ రైతు వేదికలో స్థానికులతోపాటు అంగడిరాయిచూర్, ధర్మాపూర్ తదితర గ్రామాల ప్రజలకు భూకంపాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయకుమార్ మాట్లాడుతూ.. ఇటీవల మండలంలోని కొన్ని ప్రాంతాల్లో భూ ప్రకంపనాలు వచ్చాయని.. ఈ విషయాన్ని ప్రజలు తన దృష్టికి తెచ్చారని తెలిపారు. ఈ క్రమంలోనే అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండప్ప, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ సత్యనారాయణ, న్యాయవాది బస్వరాజ్, వన్నె.బస్వరాజ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటరవణ

అనంతగిరి: ప్రపంచ క్యాన్సర్ డేను పురస్కరించుకొని మంగళవారం జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరవణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. వ్యాధి లక్షణాలు, పరీక్షలు, చికిత్స విధానం గురించి ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలకు, గర్భిణులు, బాలింతలకు ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్, అధికారులు, సిబ్బంది నిరోషా, ప్రవీణ్, నిఖిల్, శ్రీనివాస్, రేణుకుమార్, జయరాం తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మలేరియా పీఓ డాక్టర్ రవీంద్రయాదవ్, ఏఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిషత్తు.. కసరత్తు

మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు సన్నద్ధం

- పార్టీ గుర్తుపై వెళ్లేందుకే మొగ్గు
- జిల్లాలో పెరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు
- పోటీకి సమాయత్తమవుతున్న ఆశావహులు
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం



వికారాబాద్‌లోని జెడ్పీ కార్యాలయం

వికారాబాద్: మళ్లీ ఎన్నికల కాలం మొదలవబోతోంది. ఇప్పటికే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగియగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో అన్నింటికంటే ముందుగా గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీ కాలం ముగియగా ప్రభుత్వం వాటికి కాకుండా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ గుర్తుతో నిర్వహించే ఎన్నికలకు వెళ్లాలని భావిస్తోంది. అందుబాటులో ఉన్న 2011 జనాభా లెక్కల ప్రకారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు ఎన్ని ఉండాలనే దానిపై అధికారులు ఓ అంచనాకు వచ్చారు. కొత్తగా ఏర్పాటైన మండలాలు, పక్క మండలాల నుంచి కలిసిన గ్రామాలు, మండలాల నుంచి మున్సిపాలిటీల్లో కలిసిన గ్రామాలను పరిగణలోకి తీసుకుని మండలాల వారీగా ఎంపీటీసీల సంఖ్యను నిర్ణయించారు. ఈ లెక్కలు మంగళవారం పంచాయతీరాజ్ కమిషనర్‌కు అందజేసినట్లు సమాచారం.

ప్రస్తుతం ప్రత్యేక పాలన

గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగియగా ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఇప్పటికే జీపీ ఎన్నికలు పూర్తి కావాల్సి ఉన్నా ప్రభుత్వం అనివార్యకారణాలతో వాయిదా వేసింది. జిల్లాలో మొత్తం 221 మంది ఎంపీటీసీలు ఉండగా వారి పదవీ కాలం గతేడాది జూలై 3వ తేదీతో ముగిసింది. 18 మంది జెడ్పీటీసీలు ఉండగా వారి పదవీ కాలం కూడా ఒక్కరోజు తేడాతో అంటే జూలై 4తో ముగిసింది. వీటి బాధ్యతలను ప్రత్యేకాధికారులకు కేటాయించారు. ఇప్పటి వరకు స్థానిక సంస్థల్లో దేనికీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాలేదు. గతంలో జీపీ ఎన్నికలకు సిద్ధం కావాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని, బీసీ కమిషన్ నివేదికతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ షెడ్యూల్ విడుదల చేయడంతో.. ఆ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అయితే అది కాస్త పక్కన పెట్టిన ప్రభుత్వం తాజాగా పరిషత్ ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించింది. దీంతో ఇప్పుడు అందరి దృష్టి మండల, పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలపై పడింది. ఈ నేపథ్యంలో ఇక వరుస ఎన్నికలు రావడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలకు మరి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

కొత్త మండలాల్లో..

జిల్లాలో 2019 ఎన్నికల్లో 18 మండల పరిషత్‌లకు ఎన్నికలు జరగ్గా ప్రస్తుతం కొత్తగా ఏర్పాటైన చౌడాపూర్, దుద్యాల్ మండలాల్లో కూడా ఈ సారి ఎన్నికలు జరగనున్నాయి. దీంతో మండల పరిషత్‌ల సంఖ్య 18 నుంచి 20కి చేరింది. గతంలో 221 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ప్రస్తుతం వీటి సంఖ్య 227కు చేరింది. ప్రస్తుతం మన జిల్లా పరిధిలోని బొంరాస్‌పేట.. నారాయణపేట్ జిల్లా పరిధిలోని కోస్గి మండలం నుంచి కొన్ని కొన్ని గ్రామాలను తీసుకుని దుద్యాలను కొత్త మండలంగా ఏర్పాటు చేశారు. కుల్కచర్ల మండలానికి చెందిన కొన్ని గ్రామాలు.. గతంలో మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలో కలిసిన మరి కొన్ని గ్రామాలతో మరో కొత్త మండలం చౌడాపూర్‌ను ఏర్పాటు చేశారు. పరిగి మండలం నుంచి కొన్ని గ్రామాలు పరిగి మున్సిపాలిటీలో విలీనం చేసినప్పటికీ నవాబుపేట.. కోస్గి మండలాల నుంచి కొన్ని గ్రామాలు మన జిల్లాలో కలవటంతో ఎంపీటీసీల సంఖ్య పెరిగింది. అంటే ఈ సారి కొత్తగా ఏర్పాటైన రెండు మండలాల్లో ఆరు ఎంపీటీసీ స్థానాలు, రెండు జెడ్పీటీసీ స్థానాలు, రెండు ఎంపీపీ స్థానాలకు కూడా ఎన్నికలు జరగనున్నాయి.

నీటి సమస్య రావొద్దు

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- పనుల పురోగతిపై సమీక్ష

కొడంగల్: వేసవిలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని అలాగే అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని కడా కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ శాఖల పరిధిలో చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇప్పటికే మంజూరైన పనులను వెంటనే మొదలు పెట్టాలన్నారు. సంబంధిత అధికారులు సర్వేలు చేసి సమస్యలు రాకుండా పనులు చేయాలన్నారు. గ్రామాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలగరాదన్నారు. పనులు చేసే క్రమంలో విద్యుత్, నీటి సరఫరాకు సంబంధించి ఆటంకాలు ఉంటే మీడియా ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వ భవనాల మరమ్మతులతో పాటు విద్యుత్, పెయింటింగ్ పనులు పూర్తి చేసి అందంగా తీర్చి దిద్దాలన్నారు. అంగన్‌వాడీ, మండల సమీకృత భవనాలు, ప్రహరీలు, అదనపు తరగతి గదుల పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద మంజూరైన రూ.5లక్షల లోపు సీసీ రోడ్డు పనులను చేయాలన్నారు. గ్రామ కూడళ్లలో నాణ్యమైన హైమాక్స్ వీధి దీపాలను బిగించాలన్నారు. సమావేశంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ వసంత్‌నాయక్, మిషన్ భగీరథ ఎస్ఈ జగన్మోహన్, ఈఈ చల్మారెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ నీలావతి వివిధ శాఖల డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టండి

కొడంగల్ మండలం అంగడి రాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పీహెచ్‌సీని పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. భవన లీకేజీలను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అవసరాలకు అనుగుణంగా లైట్లు, ఫ్యాన్లు సమకూర్చాలని ఆదేశించారు. సబ్ సెంటర్లకు పంపిస్తున్న మందుల వివరాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డాక్టర్లు బుష్రా, జ్యోతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

గ్రామ దేవతకు బోనాలు

తాండూరు రూరల్: మండలంలోని కోత్లాపూర్‌లో గ్రామ దేవత ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనమెత్తి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోతరాజుల నృత్యాలు, శివసత్తుల శిగాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భవిష్యవాణి వినిపించారు.


బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

నవ వధువు ఆత్మహత్య

- అదనపు కట్నం వేధింపులు భరించలేక బలవన్మరణం

అనంతగిరి: పెళ్లై మూడు నెలలు కాకముందే ఓ నవ వధువు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన వికారాబాద్ పట్టణంలోని సాకేత్ నగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాకేత్ నగర్‌కు చెందిన సాయికి గత ఏడాది నవంబర్ 17న సంగారెడ్డి జిల్లా మునిపల్లికి చెందిన శ్రీజ(20)తో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.2 లక్షల నగదు, 12 తులాల బంగారం, బైక్ ఇచ్చారు. పెళ్లి అయిన కొన్ని రోజుల వరకు సంసారం బాగానే సాగింది. ఆ తర్వాత సాయి అదనపు కట్నం కోసం భార్యను వేధించడం మొదలు పెట్టాడు. మరో రూ.3లక్షలు తేవాలని ఒత్తిడి చేశాడు. పెళ్లికి చాలా ఖర్చు చేశారని, ఇప్పుడు డబ్బు ఇచ్చే పరిస్థితి మా కుటుంబానికి లేదని శ్రీజ భర్త సాయికి సర్దిచెప్పే ప్రయత్నం చేసింది. కానీ వినలేదు. డబ్బు కావాలని పట్టుబట్టాడు. దీంతో విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పింది. అనంతరం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు వికారాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీజ(ఫైల్)

మార్కెట్ ఫీజు వసూలుకు స్పెషల్ డ్రైవ్

నేటి నుంచి తనిఖీలు చేపట్టనున్న ప్రత్యేక బృందాలు

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: మార్కెట్ ఫీజుకు ఎగనామం, రైతులకు శఠగోపం అనే శీర్షికన సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ధారూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ వ్యవసాయ మార్కెట్ల పరిధిలో ఆయా ఏఎంసీ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు బుధవారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. టీం లీడర్‌గా ధారూరు మార్కెట్ కార్యదర్శి సిద్ధమ్మ నియమితులయ్యారు. మార్కెట్ ఫీజు వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఇందు కోసం ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. మార్కెట్ ఫీజు ఎగ్గొట్టే వ్యాపారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరుగా పంట ఉత్పత్తులు కొనుగోలు చేసే వ్యాపారులను గుర్తించి వారి నుంచి మార్కెట్ ఫీజు వసూలు చేయాలని, అలాగే తూకాల్లో మోసం, తరుగు తీత, కమీషన్ వసూలును అరికట్టాలని సూచించారు. ఒక్కో మార్కెట్ కమిటీ కార్యదర్శికి ఇద్దరు సెక్యూరిటీ గార్డ్స్‌ను రక్షణగా ఉంటారు. ఆయా మార్కెట్ కమిటీల సూపర్‌వైజర్లు, కార్యదర్శులు స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటారు. జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ సారంగపాణి స్పెషల్ డ్రైవ్‌ను పర్యవేక్షిస్తారు. ధారూరు మండలం రాంపూర్ తండాలో మంగళవారం రెండు డీసీఎం వాహనాల్లో 165 క్వింటాళ్ల వేరుశనగను తరలిస్తుండగా ఏఎంసీ కార్యదర్శి సిద్ధమ్మ పట్టుకున్నారు. రెండు డీసీఎంల నుంచి రూ.9,570 మార్కెట్ ఫీజుగా వసూలు చేసి మొదటి తప్పుగా భావించి వదిలేస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి ఎక్కడ వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసినా మార్కెట్ ఫీజు చెలిలచాలని ఆదేశించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

అడిషనల్ కలెక్టర్ సుధీర్ కుమార్

కొడంగల్: వేసవి కాలం సమీపిస్తున్నందున అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్ కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవిలో ప్రజలకు తగినంత తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఇందుకోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు గ్రామాలపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉష శ్రీ, పీఆర్ డీఈఈ సుదర్శన్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, ఎమ్ఈఓ రాంరెడ్డి, సీడీపీఓ రజిత, ఎమ్‌పీఓ జైపాల్‌రెడ్డి, ఏపీఓ రాములు, ఏపీఎమ్ వెంకన్న, వార్డెన్లు హన్మంత్‌రెడ్డి, వరలక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కొడంగల్: ఎస్సీ వర్గీకరణ కోసం మంత్రివర్గం ఆమోదం తెలిపిన నేపథ్యంలో మంగళవారం కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జాతీయ కో ఆర్డినేటర్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ సూచన మేరకు తెలంగాణలో బీసీల కుల గణన, ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్త, ఏఎంసీ చైర్మన్ అంబయ్యగౌడ్, మాజీ సర్పంచులు బాల్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, అంజద్, చిట్లపల్లి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టండి

బీజేపీ ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ రాజశేఖర్



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అనంతగిరి: జిల్లా పరిధిలో రోడ్లు అధ్వానంగా మారాయని.. వెంటనే అవసరమైన చోట నూతన రోడ్లు, మరమ్మతులు చేపట్టాలని బీజేపీ ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ రాజశేఖర్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రావణ్‌ప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. నిబంధన ప్రకారం హెచ్చరిక, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా నాయకులు యాదగిరి, శంకర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భవానీమాత వార్షికోత్సవాలు



అమ్మవారి సేవలో తిరుపతిరెడ్డి

అనంతగిరి: వికారాబాద్ పట్టణం వెంకటపూర్ తండాలో వెలిసిన జగదాంబ భవాని మాత, జగద్గురు సేవాలాల్ మహరాజ్ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి వేడులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కిషన్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఆర్‌టీఏ డైరెక్టర్ ఎర్రవల్లి జాఫర్, మున్సిపల్ మాజీ చైర్మన్లు సత్యనారాయణ, మంజుల, మాజీ కౌన్సిలర్లు మురళి, లక్ష్మణ్, నాయకులు రెడ్యానాయక్, పరుశరాం నాయక్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టాంప్ డ్యూటీ బకాయిలు విడుదల

- మున్సిపల్ ప్రత్యేక ఖాతాల్లో జమ
- నిధుల వినియోగంపై మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం



పరిగి మున్సిపల్ కార్యాలయం

పరిగి: ఇన్నాళ్లు నిధులు లేక నీరసించిపోయిన మున్సిపాలిటీలకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్టాంపు డ్యూటీ, ఆస్తి మార్పిడి రుసుంకు సంబంధించిన బకాయి నిధులను ఇటీవల ప్రభుత్వం విడుదల చేసింది. 2019 నుంచి స్టాంపు డ్యూటీ, 2022 నుంచి ఆస్తి మార్పిడి రుసుం ద్వారా వచ్చిన పన్ను బకాయిల వాటను జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల ప్రత్యేక ఖాతాల్లో జమ చేసింది. దీంతో మున్సిపాలిటీలకు ఊరట లభించింది. ఈ డబ్బు ఖర్చులకు సంబంధించి మార్గదర్శకాలను సైతం విడుదల చేసింది. ప్రతి ఆరు నెలలకోసారి స్టాంపు డ్యూటీ డబ్బులు విడుదల చేస్తే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు, కరెంట్ బిల్లుల చెల్లింపు ఇబ్బందులు తప్పుతాయని అధికారులు భావిస్తున్నారు.

వేతనాలు, కరెంట్ బిల్లులకే.

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు స్టాంపు డ్యూటీ బకాయిలను విడుదల చేయడంతో పాటు వాటి వినియోగంపై కూడా మార్గదర్శకాలు విడుదల చేసింది. మున్సిపాల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు, కార్యాలయాల కరెంట్ బిల్లుల చెల్లింపు, ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాల నిర్వహణకు మాత్రమే ఈ డబ్బులు వినియోగించాలని ఉత్తర్వులో పేర్కొంది. వార్డుల్లో సీసీ రోడ్లు, వీధిదీపాలు, మురుగు కాలువల నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించవద్దని స్పష్టం చేసింది. నిధుల వినియోగంపై ప్రభుత్వం పూర్తి ఆంక్షలు విధించడంతో అధికారులు అయోమయంలో పడ్డారు. గతంలో వార్డుల్లో చేసిన పనులకు, పెండింగ్ బిల్లుల చెల్లింపులు, వార్డుల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించి నిధుల కోసం ఎదురుచూస్తున్న వారికి ఈ ఆంక్షలు మింగుడు పడటం లేదు.

ప్రతి రిజిస్ట్రేషన్‌పై 0.5 శాతం

మున్సిపాలిటీల పరిధిలోని ఖాళీ స్థలాలు, వాణిజ్య భవనాలు, నివాస భవనాలు, క్రయ విక్రయాలు జరిగి రిజిస్ట్రేషన్లు అయితే రిజిస్ట్రేషన్ ఖర్చులో 0.5శాతం స్టాంపు డ్యూటీ డబ్బులు ఆయ మున్సిపాలిటీలకు చెల్లించాలి. గతంలో రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే మున్సిపాలిటీల ఖాతాలో ఆ మొత్తాన్ని జమ చేసే వారు. కానీ 2019 సంవత్సరంలో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు తేవడంతో అప్పటి నుంచి మున్సిపాలిటీలకు రావాల్సిన స్టాంపు డ్యూటీ డబ్బులు నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్తున్నాయి. దీంతో ఐదేళ్లుగా స్టాంపు డ్యూటీ డబ్బులు రాకపోవడంతో ఆయ మున్సిపాలిటీల ఆదాయం తగ్గింది. ఈ క్రమంలోనే మున్సిపాలిటీలకు రావాల్సిన స్టాంపు డ్యూటీ డబ్బులు చెల్లించాలని గత పాలకవర్గం ప్రభుత్వానికి విజ్ఞాప్తి చేశారు. దీంతో ప్రభుత్వం గత నెలలోనే స్టాంపు డ్యూటీ డబ్బులను మున్సిపాలిటీల ఖాతాలో జమ చేసింది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు వికారాబాద్‌కు రూ. 6కోట్లు, పరిగికి రూ.1.85 కోట్లు, తాండూరుకు రూ.7కోట్లు, కొడంగల్‌కు రూ.49లక్షలు మొత్తం 15.34 కోట్లు జమ అయ్యాయి.

మున్సిపాలిటీల వారీగా విడుదలైన నిధులు

మున్సిపాలిటీ	మంజూరైన మొత్తం
పరిగి	రూ.1.85 కోట్లు
వికారాబాద్	రూ.6 కోట్లు
తాండూరు	రూ.7 కోట్లు
కొడంగల్	రూ.49 లక్షలు

మార్గదర్శకాల ప్రకారమే..



రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీకి స్టాంపు డ్యూటీ డబ్బులు విడుదల చేసింది. ఐదేళ్ల స్టాంపు డ్యూటీకి సంబంధించి పరిగి మున్సిపాలిటీకి రూ. 1.85 కోట్లు వచ్చాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే నిధులను వినియోగిస్తాం.

– వెంకటయ్య మున్సిపల్ కమిషనర్, పరిగి

పురిట్లోనే పసికందు మృతి

- తాండూరు ఎంసీహెచ్‌లో ఘటన
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధితుల ఆరోపణ
- విచారణ చేపడుతామని ఆస్పత్రి కరస్పాండెంట్ వెల్లడి



కాన్పు కోసం ఎంసీహెచ్‌లో చేరిన రాజేశ్వరి



మృతి చెందిన శిశువు

తాండూరు టౌన్: పురిటిలోనే పసికందు మృతి చెందిన ఘటన మంగళవారం తాండూరు మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చోటుచేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందిందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా, తమ తప్పేమీ లేదని వైద్యులు చెబుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. పెద్దేముల్ మండలం తట్టేపల్లి గ్రామానికి చెందిన పిట్ల నర్సింహులు, తన భార్య రాజేశ్వరిని సోమవారం ఉదయం 8 గంటలకు కాన్పు నిమిత్తం పట్టణంలోని ఎంసీహెచ్‌కు తీసుకువచ్చాడు. రాత్రి 10గంటలకు సాధారణ కాన్పు కాగా చలనం లేని స్థితిలో శిశువు జన్మించింది. పుట్టిన కొద్ది సేపటి తర్వాత శిశువు మృతి చెందినట్లుగా వైద్యురాలు నిర్ధారించారు. దీంతో బాలింత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం ఆస్పత్రికి వస్తే ఆలస్యంగా రాత్రి కాన్పు చేశారన్నారు. వైద్యురాలు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే శిశువు మృతి చెందిందని ఆరోపించారు. కాగా తమ తప్పేమీ లేదని, కాన్పు తేదీ కంటే మూడు రోజులు ఆలస్యంగా వచ్చారని, అలాగే గర్భంలో శిశువు మలం మింగడం వల్ల, ఊపిరాడక మృతి చెందిందని వైద్యురాలు శ్రీవాణి వివరణ ఇచ్చారు. డాక్టర్, సిబ్బంది వారి విధులు వారు నిర్వర్తించారని, అయినప్పటికీ పసికందు మృతిపై ఉన్నతాధికారుల నేతృత్వంలో పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని ఎంసీహెచ్ కరస్పాండెంట్ డాక్టర్ రవిశంకర్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

మునగకాయలు కోస్తుండగా ప్రమాదం



రజిని మృతదేహం

మొయినాబాద్: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరన్నపేటలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా, వేమూరు గ్రామానికి చెందిన సుబ్బారావు, అతని భార్య రజిని(52) కొంతకాలంగా వీరన్నపేటలోని రాజ్‌కుమార్ ఫాంహౌస్‌లో ఉంటూ కూలీ పనులు చేస్తున్నారు. మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో రజిని కొడవలితో మునగకాయలు కోస్తుండగా పైనుంచి ఉన్న విద్యుత్ తీగలు తగిలి కరెంట్ షాక్‌కు గురైంది. వెంటనే ఆమెను స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



ఇందిరాచౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న యూత్ కాంగ్రెస్ శ్రేణులు

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్

తాండూరు టౌన్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇందిరాచౌక్‌లో యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ నుంచి ఎనిమిది ఎంపీల్లో ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నప్పటికీ రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్, మండలాల అధ్యక్షులు సుధాకర్, వీరేశం, మహేశ్, సతీశ్, అల్తాఫ్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ప్రేమ్, రవి, రఫీక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల సంఖ్య పెరిగింది

ధారూరు ఎంపీడీఓ నర్సింలు

ధారూరు: మండల పరిధిలో కొత్తగా లక్ష్మీనగర్‌తండా, కొండాపూర్‌ఖుర్దు గ్రామాలు పంచాయతీలుగా మారడంతో వార్డుల సంఖ్య పెరిగిందని ధారూరు ఎంపీడీఓ నర్సింలు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులతో ఓటరు తుది జాబితాపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 34 గ్రామ పంచాయతీల్లో 286 వార్డులు అయ్యాయని, వీటిలో 36,304 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. స్త్రీలు 18,473 మంది ఉండగా పురుషులు 17,831 మంది ఉన్నట్లు చెప్పారు. ఓటరు జాబితాలో తప్పులుంటే తమ దృష్టికి తీసుకరావాలని అఖిలపక్ష పార్టీల అధ్యక్షులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీఓ షఫీఉల్లాఖాన్, సూపరింటెండెంట్ సుశీల్‌కుమార్ షిండే, వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు మాన్‌సింగ్, ఎం.రమేశ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో తగ్గిన ఎంపీటీసీ స్థానాలు

దౌల్తాబాద్: మండల వ్యాప్తంగా 14 ఎంపీటీసీ స్థానాలకు కేటాయిస్తూ ఎంపీడీఓ కార్యాలయం నుంచి తుదిజాబితా విడుదల చేసింది. గతంలో 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. కుదురుమళ్ల ఎంపీటీసీ స్థానం కొత్తగా ఏర్పడిన దుద్యాల మండలంలో చేర్చడంతో 14 ఎంపీటీసీ స్థానాలతో నూతన జాబితా విడుదల చేశారు. మాటూరు, నీటూరు, కౌడీడ్, బిచ్చాల, బాలంపేట, చల్లాపూర్, దౌల్తాబాద్-1, దౌల్తాబాద్-2కు దౌల్తాబాద్, దేశాయిపల్లి, నర్సాపూర్, చంద్రకల్ స్థానానికి చంద్రకల్, కుప్పగిరి, అంతారం, సుల్తాన్‌పూర్‌కు పోల్కంపల్లి, సుల్తాన్‌పూర్, దేవర్‌ఫసల్‌వాద్‌కు ఎల్‌జీతండా, నంద్యానాయక్‌తండా, దేవర్‌ఫసల్‌వాద్, ఈర్లపల్లి, సురాయిపల్లి, నందారం స్థానాలకు ఇండాపూర్, నందారం, ఊరగుంట, యాంకి, తిమ్మారెడ్డిపల్లికి బండివాడ, తిమ్మారెడ్డిపల్లి, అల్లాపూర్‌కు అల్లాపూర్, గుండేపల్లి, గుముడాల, తిమ్మాయిపల్లి, గోకఫసల్‌వాద్‌కు ర్యాలుగుట్ట తండా, గోకఫసల్‌వాద్ గ్రామాలను కేటాయించారు.

బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



యాలాల: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

యాలాల: ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అఖిల పక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మంగళవారం వివిధ పార్టీల మండల అధ్యక్షులతో ఎంపీడీఓ పుష్పలీల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 2014లో 52 శాతం ఉన్న బీసీలు 2024లో 46 శాతమేనని ప్రభుత్వం వెల్లడించడం వెనుక ఆంతర్యమేమిటి ప్రశ్నించారు. ఎన్నికల కోసం తప్పుడు లెక్కలు చూపి ప్రజలను మభ్యపెట్టడం సరికాదన్నారు. మరో మారు కులగణన చేపట్టాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం, టీడీపీ మండల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, శివకుమార్, బుగ్గప్ప, నాయకులు బస్వరాజ్, వడ్డే రాములు, మాజీ సర్పంచ్‌లు శివకుమార్, అరవింద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఈశ్వర్.. సూపర్

జీవితంపై విరక్తి చెంది.. క్షణికావేశంలో చెరువులో దూకే వారి పాలిట ఆపద్బాంధవుడయ్యాడు ఆ హోంగార్డు.. తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 23 మందికి పునర్జన్మ ప్రసాదించాడు.. ఆయా కుటుంబాల్లో చీకట్లు అలుముకోకుండా కొత్త 'ఊపిరి' పోశాడు..

– మహేశ్వరం

సరూర్‌నగర్ చెరువు కట్టపై విధులు

- చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన 23 మంది ప్రాణాలు కాపాడిన హోంగార్డు
- ధైర్య సాహసాలకు మెచ్చిన కేంద్రం
- రాష్ట్రపతి మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఎంపిక
- ఆగస్టు 15న రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న ఈశ్వర్



ఈశ్వర్‌ను అభినందిస్తున్న ఐపీఎస్ అధికారి మహేశ్ భగవత్

సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువు కట్టపై పోలీస్ ఔట్ పోస్ట్ ఇన్‌చార్జిగా 2020 నుంచి 2023 వరకు మూడేళ్లపాటు విధులు నిర్వర్తించాడు మంత్రి ఈశ్వరయ్య అలియాస్ ఈశ్వర్. అదే సమయంలో వివిధ కారణలతో సరూర్‌నగర్ చెరువులోకి దూకి ఆత్మ హత్యకు యత్నించిన 23 మందిని రక్షించాడు. బాధితులను రక్షించే క్రమంలో కొన్నిసార్లు ప్రాణపాయం వరకూ వెళ్లాడు. అయినా వెరవకుండా చెరువులో దూకేవారి ప్రాణాలను కాపాడాడు. అతని ధైర్య సాహసాలు, సేవలకు గుర్తింపుగా కేంద్రం ప్రతిష్టాత్మక భారత రాష్ట్రపతి మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఇటీవల ఎంపిక చేసింది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి చేతులమీదుగా ఈశ్వర్ అవార్డు అందుకోనున్నారు.

కర్తవ్యాన్ని గుర్తు చేసుకుని..

మహేశ్వరం మండలం పెండ్యాల గ్రామానికి చెందిన ఈశ్వర్ చిన్నప్పుడు బావులు, చెరువుల్లో ఈత నేర్చుకున్నాడు. స్నేహితులతో ఈత కొట్టే సమయంలో పోటీలు పెట్టుకుని మొదటి స్థానంలో నిలిచేవాడు. 2000 సంవత్సరంలో హోంగార్డుగాఎంపిక య్యాడు. 2020లో సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యాడు. చెరువు కట్టపై పోలీస్ ఔట్ పోస్ట్ డ్యూటీ వేశారు. విధి నిర్వహణలో ఉన్న సమయంలో ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోబోయాడు. కాపాడే క్రమంలో అతడు కళ్ల ముందే చనిపోయాడు. ఈ సంఘటన ఈశ్వర్‌ను కలిచివేసింది. అదే సమయంలో వివిధ కారణాలతో ఎంతోమంది చెరువులో దూకి ఆత్మ హత్యయత్నానికి పాల్పడుతుంటారని.. అలాంటి వారిని కష్టపడి రక్షించి ప్రాణాలు పోకుండా చూడాలని సీఐ సీతారామ్ చేసిన హితబోధ తన కర్తవ్యాన్ని గుర్తు చేశాయి. ఈ క్రమంలోనే రెండు రోజులకే చెరువులో దూకిన యువకుడిని కాపాడాడు. ప్రేమ విఫలమై, సంసారంలో కలతలు వచ్చి గొడవలు పడిన దంపతులను రక్షించాడు.

గాయాలైనా వెరవక..

చెరువులో దూకిన వారిని రక్షించే క్రమంలో కష్టంగా ఉండేది. బరువుగా ఉన్న వారిని ఒడ్డుకు తీసుకువచ్చే క్రమంలో ఒక్కోసారి పట్టుకొని చెరువు లోపలికి లాగేవారు. చెరువులో ముళ్లు, రాళ్లు, పడేసిన సీసాల ముక్కలు కాళ్లకు తగిలి తీవ్ర గాయాలయ్యేవి. విధి నిర్వహణలో ఉన్నప్పుడు ఎప్పుడూ వెనుకడుగు వేయొద్దని, చెరువులో దూకిన వారిని ప్రాణాలతో కాపాడాలని కుటుంబ సభ్యులు, ఏసీపీ, సీఐ, ఎస్ఐలు చెప్పి ప్రోత్సహించేవారు. అలా 23 మందిని రక్షించాడు. భారత రాష్ట్రపతి మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఎంపికకావడంపై ఎంతో మంది పోలీస్ ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈశ్వర్ ప్రస్తుతం మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు.



సరూర్‌నగర్ చెరువులో దూకిన వారిని కాపాడుతున్న హోంగార్డు ఈశ్వర్ (ఫైల్)

బాధ్యత మరింత పెంచింది



చెరువులో దూకి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడిన వారిలో ప్రాణాలతో బయటపడ్డవారు ఇప్పటికీ ఫోన్లు చేసి మాట్లాడుతుంటారు. నీ వల్లే ఈరోజు బతికిబట్టకట్టామని, కొత్త జీవితాన్ని ఇచ్చావంటూ కృతజ్ఞతలు చెబుతుంటారు. వారు మాట్లాడుతుంటే నిజంగా గర్వంగా ఉంటుంది. రాష్ట్రపతి మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ఇది నా బాధ్యతను మరింత పెంచింది.

– ఈశ్వర్

రుణాలు సకాలంలో చెల్లించండి

పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా

కొడంగల్: ప్రాథమిక సహకార సంఘంలో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పీఏసీఎస్ ద్వారా రైతులకు రుణాలిచ్చామని.. వ్యవసాయ రుణాలు, పంట రుణాలు, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు ఉన్నట్లు చెప్పారు. మార్చి లోపు పంట రుణాలను రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. మార్చి లోపు రెన్యూవల్ చేయించుకుంటే తక్కువ వడ్డీ ఉంటుందన్నారు. స్వల్ప, దీర్ఘకాలిక రుణాల కిస్తులు చెల్లించాలన్నారు. సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులతో ఎస్ఈ సమీక్ష



మాట్లాడుతున్న ఎస్ఈ రామ్మోహన్

షాద్‌నగర్: విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని ట్రాన్స్ కో ఎస్ఈ రామ్మోహన్ సూచించారు. పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గ్రామాలు, పట్టణంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే గుర్తించి, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయానికి, గృహ, వ్యాపార సముదాయాలకు అవసరమైన కరెంటు సరఫరాలో ఎలాంటి ఆటంకం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఈ శ్యాంసుందర్ రెడ్డి, ఏడీఈలు సత్యనారాయణ, రవీందర్, ఏఈ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

దుర్గమ్మసేవలో 'పట్నం' న్యాయమూర్తి

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మను ఇబ్రహీంపట్నం ఏడవ చీఫ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ రీటాలాల్ చంద్ దంపతులు మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారికి కుంకుమ అర్చన చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

టెన్త్ విద్యార్థులకు 'సాక్షి' స్టడీ మెటీరియల్



కేజీబీవీలో విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న ఎంఈఓ హబీబ్ అహ్మద్

కుల్కచర్ల: మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలలు, కేజీబీవీ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు సాక్షి దినపత్రిక (జగతి పబ్లికేషన్స్) ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ హబీబ్ అహ్మద్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నతి కోసం సాక్షి మీడియా గత మూడేళ్లుగా మోడల్ పేపర్లు, స్టడీమెటీరియల్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కొనుగోలు రసీదులు తప్పనిసరి

- మన గ్రోమోర్‌లో ఆకస్మిక తనిఖీలు
- ఎక్స్‌పెయిరీ డేట్‌పై సంజాయిషీ ఇవ్వాలి లేదంటే దుకాణం సీజ్
- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి



ధారూరు మన గ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఏఓ మోహన్‌రెడ్డి

ధారూరు: వ్యవసాయ శాఖ లైసెన్సులున్న డీలర్ల వద్దే ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం ఆయన ధారూరు రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం మన గ్రోమోర్ ఫర్టిలైజర్ షాప్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో ఉన్న మోనోక్రొటోఫాస్ క్రిమి సంహారక మందు డబ్బాపై తయారు తేదీ నుంచి 24 నెలల గడువు ఉండడం చూసి 18 నెలలకు బదులుగా 24 నెలల గడువు ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించగా.. తమ మేనేజర్‌కు విషయం చెబుతామని సిబ్బంది ఆయనకు సమాధానం ఇచ్చారు. ఈ విషయమై త్వరితగతిన సంజాయిషీ ఇవ్వాలని.. లేని పక్షంలో దుకాణం సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయన డీలర్లతో సమావేశమై రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అంటగట్టవద్దని, అవసరమైన క్రిమిసంహారక మందులు, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. స్టాక్, సేల్ రిజిస్టర్లు నిర్వహిస్తూ ఆన్‌లైన్‌లో వివరాలు ఉంచాలని, ఆన్‌లైన్‌లో లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కేరెళ్లిలో నిర్వహించిన డిజిటల్ సర్వేను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న క్రాప్ సర్వేకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధారూరు పీఏసీఎస్ సీఈఓ కె.నర్సింలు, ఏఈఓ సంతోష్, డీలర్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు షాద్‌నగర్ అధ్యాపకుడు

షాద్‌నగర్‌రూరల్: సింగపూర్ యూనివర్సిటీలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు షాద్‌నగర్‌కు చెందిన అధ్యాపకుడు సామ రవీందర్‌రెడ్డి మంగళవారం సింగపూర్‌కు చేరుకున్నారు. సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రతినిధి ప్రొఫెసర్ థాం షాంగ్‌నైను అక్కడి ఎయిర్‌పోర్టులో కలుసుకున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో దేశం తరపున 'అర్బన్ డెవలప్‌మెంట్ స్ట్రాటజీ క్లైమెట్ మిటిగేషన్' అంశంపై రాసిన పరిశోధన పత్రాన్ని ప్రజెంట్ చేయనున్నారు. భారతదేశం ప్రస్తుతం వాతావరణంలో మార్పును ప్రధాన సమస్యగా ఎదుర్కొంటోందని, ఈ సమస్యను అధిగమించి అభివృద్ధి చెందే విధంగా ప్రజెంటేషన్ చేయబోతున్నందుకు ఆనందంగా ఉందని రవీందర్‌రెడ్డి తెలిపారు.